# పనిమనిషి

పురాణం సూర్యప్రకాశరావు

ప్రుండులాంటి చలి ఎముకలు కొరికేస్తుంటే పళ్ళు టక టక మంటూ పెదాల్ని కరుచుకుంటుంటే భజన పాటలు పాడుకుంటూ మల్లి బాబుగారి ఇంటిగేటు తెరుచుకుని "అమ్మగోరూ! అమ్మగోరూ!" అంటూ పిలిచింది పని మనిషి మా లచ్చి.

"అబ్బ! ఇది అప్పుడే తగులడిందేం" అని విసుక్కుని కళ్ళు నులుపుకుంటూ రావుమ్మగారు తలుపు తీశారు.

"ఎంత పిలిచినా లెగరేందమ్మా" అంది మా లచ్చి.

"నీ బొంద! ఇంత చీకటి ఉండగానే తగులడ్డావేం నా ప్రాణానికి."

"అదేందమ్మ గారోయ్ సప్పగా తెల్లారిపోతుంటే."

"ఏడిశావ్ లెద్దూ వెధవ వాదనా నువ్వూను." అంటూ రావుమ్మగారు వంటగది తలుపు తాళం తీసి గొణుకుతూనే అంట్లు బయట పడేసి గడియ వెయ్యబోతుంటే "సింతపండు మరిశారు" అంది మా లచ్చి.

"అబ్బ! నువ్వెక్కడ దాపరించావే కనిలాగ" అంటూ ఆమె మళ్ళీ తలుపులు తీసి చింతపండు తీసుకొచ్చి గిరవాటు పెట్టింది.

దాన్ని వెతుక్కోవటంతోనే సరిపోయింది మా లచ్చికి. అంట గిన్నెలన్నీ వేపచెట్టు కిందకి మోసుకుపోయి కోక పైకి ఎగ్గట్టి గిన్నెలకి ఇసక పట్టించి బరబరా తోముతూ కూచుంది.

చీకటి తెరల్ని తెముల్చుకుంటూ మసక వెలుగు బయట పడుతూంది.

"ఎంత తోమినా వదలడేం ఖర్మ" అనుకుంది మా లచ్చి అంటగిన్నెమీద పల్లగా పట్టుకుపోయిన మసిని కసిగా ఇసకతో తోముతూను.

"ఇంత మట్టి పట్టించి పొయ్యిమీద పెట్టకూడదూ. ఆ మాత్రం తెలీదట్టా. చస్తుండను తోమనేక. ఒక్క గిన్నెకు ఇంత పాలి అవుతే ఈ గిన్నెలన్నీ తోమే తలికి మిట్టమద్దినాల అయేట్టుండే. రెక్కలన్నీ నచ్చిపుండయి పోతన్నాయి."

ఒళ్ళు జల్లుమనేలా ఓగాలి విసురు వోసుకొచ్చింది. మా లచ్చి మరింతగా బిగుసుకుపోయింది. తడి చేతులు వజవజ వొణికాయి.

"మా లచ్చీ నీ అమాయికత్వం చూస్తుంటే జాలి వేస్తూందే. ఇంత మెతక మనిషివి కాబట్టే నీ మొగుడు నిన్ను ఒదిలేశాడు. అయినా నాలుగయిదేళ్ళు కాపరం చేసి ఓ పిల్లాడ్ని కూడా కని ఇదేం పాడు బుద్ధంట" అన్నారు రావుమ్మగారు నిన్న. ఈ మాటలే ఇప్పుడు మనసులో తిరిగాయి మా లచ్చికి. మా లచ్చి కళ్ళు రెండూ చెమర్చాయి. మోచేత్తో తుడుచుకుని ముక్కు ఎగపీల్చుకుంది. 'నాలుగేళ్లు కాపరం సేసిండు. ఎట్ట సేసిండు? ఎంత అపేచ్చ ఒలకబోసిండు! లచ్చీ లచ్చీ అంటూ నిద్దరలో కలవరించేవాడు! ఇంటికొత్తే కూడా కూడా ఇడవకుండా తిరిగేవాడు! అంత పేమ కనబరిసిన మడిసి ఇట్టాటి ఎదవపని సేస్తాడని నాను కలగన్నానా? ఎంత పని సేసిండు! నిలువునా కొంప ముంచిండు.'

మా లచ్చి కళ్ల వెంబడి ధారావాహినిగా కారిపోయింది కన్నీరు. తొలినాటి వలపు తలపులు మొదలుకుని తుదిరేయి తనలో రేగిన తుపాను వరకూ ఆమె మెదడులో గిరగిరా తిరిగిపోయాయి. "పక్కింటి సరమ్మకి అప్పచెప్పి వచ్చింది పసివాడ్ని. వాడేం ఏడుస్తున్నాడో? మరీ రెండు దినాలనుంచీ పసిబిడ్డ అదేదోగా ఉంటున్నాడు. వైద్యుడికి సూపించాల. ఏందో సూపించాల సూపించాల అనుకోటమే గాని సూపెట్టమే పట్టంలేదు. ఎంత పొద్దూ ఈ చాకిరీతోనే సరిపోతుండె. పొద్దు పొడిపి లెగిసింది మొదలు గొడ్డులా వళ్ళు విరుచుకోవటంతోనే సరిపోయె. ఏం బ్రతుకో...థూ!!"—మా లచ్చికి ఒక్క క్షణం తీరిక ఉండదు. తీరిక చేసుకుందామనుకుంటే పొట్ట గడవదు. తనే కాకుండా తన బుడ్డాడి సంరక్షణ భారం ఒకటి ప్రధాన సమస్య అయిపోయింది.

వాడ్ని సాకటంలో మా లచ్చి ఒక పద్ధతి పెట్టుకుంది. ఉదయం తను పనికి పోయేటప్పుడు పాలిస్తుంది. మధ్యలో ఓ మారు వచ్చి పాలిస్తుంది. మళ్లీ సాయంత్రం చీకటి పడ్డాకే రావటం. కూడా వెంటబెట్టుకుని పోదామంటే మరీ పసిగుడ్డు. అయినా పనికి అడ్డుకదూ. ఎక్కడ పడుకోబెడుతుంది? మల్లి బాబుగారు నెలకి పదిరూపాయిలిస్తారు. ఉదయం నించి మధ్యాహ్నం వరకూ మళ్ళీ ఓ గంట విశ్రాంతి తర్వాత సాయంత్రం బాగా చీకటి పడేవరకూ అక్కడే పని చెయ్యాలి.

పొద్దుకన్నె ఇంత చద్దన్నం రాత్రి మిగిలింది పడేస్తూంటారు. అలా జీవితం ఒక గాడినపడి సాగిపోతూంది.

"ఏమే ఇంకా అంట్లు తోమలా?"— దూరంగా లామల్లోంచి నీరు ప్రవహిస్తున్నట్టుగా వినిపించాయి రావుమ్మగారి మాటలు. ఆలోచనల్లోంచి తెప్పరిల్లి "అవుతుండయ్యమ్మా" అని జవాబిచ్చింది మా లచ్చి.

"ఏ వేళయిందే నీకు అంట్లు వేసి! ఇంకా తోముతున్నావా? నేను ఓ నిద్రతీసి లేచి కాఫీ నీళ్లు పడేసి ఇంటిల్లిపాదీ మొఖాలు కడుక్కున్నా నీ అంట్లు తోమటం పూర్తి కాలా? అయినా నీకు పనంటే ఎక్కసం అయిపోయిందిలే. అంత ఇష్టం లేకపోతే మానెయ్యరాదూ. ఈ మాత్రం పనికే బద్ధకిస్తున్నావే రేపు అమ్మాయి పెళ్ళయితే నువ్వు నిలబడి చెయ్యగలవుటే? మరీ అంత మన్నుతిన్న పాములా తయారవుతున్నావేం" అంటూ రావుమ్మ ఓ తట్ట వరస చెరిగేసింది పని గట్టుకుని.

మబ్బు విడిచిన ఎండలా ఒక్కమారు మా లచ్చి నవనాళ్ళూ తిరిగి చురుగ్గా పని చేయసాగాయి. ఇంకా తెల్లగా తెల్లవారకపోయినా గిలక చప్పుళ్లూ, కోళ్ళ కూతలూ, చలికాచుకుంటున్న ఇరుగు పొరుగువాళ్ళ మాటలూ పనివాళ్లు తోముతున్న గిన్నెల చప్పుళ్లూ దూరంగా 'హోటళ్ళవాళ్లు వేసే గ్రామఫోను గొంతులూ ఒకదాన్ని మరొకటి కప్పేస్తూ గొడవగా వినవస్తున్నాయి.

తెల్లగా తెల్లవారిపోయింది. ఎండ చార అరిటి ఆకుల సందుల్లోంచి మా లచ్చి ముఖం

మీదపడ్డది. మాలచ్చి ఓమారు సూర్యుడి వైపు చూసింది. రెండు చేతులూ జోడించి మనసులో ఏవో అనుకుని నమస్కారం చేసింది.

"ఓ యబ్బో! అదేవిటోవ్ సూర్య నమస్కారం చేస్తున్నావు" అంది రావుమ్మగారు నవ్వుతూను.

"చిన్నప్పట్నించి అలవాటు అమ్మగారూ. అయ్య అలా దండం పెట్టాలని సెప్పిండు. అయ్య సెప్పినట్టే సేస్తుండాను" అంది మాలచ్చి.

"మంచి పని చేస్తున్నావుగాని మార్కెట్టుకుపోయి ఓ వీశడు వంకాయలూ, ఓ వీశడు బెండకాయలూ, సవాశేరు మిరపకాయలూ, అణా అల్లం పట్టుకురా, ఇక్కడున్నట్టు రావాలి." అంటూ రావుమ్మగారు ఓ రూపాయి నోటూ, సంచీ చేతికిచ్చింది.

మాలచ్చి బయల్దేర బోతూంటే మళ్లి బాబుగారు "ఏమేవ్, దాన్ని వచ్చేటప్పుడు దారిలో భారత్ బ్లేడ్లు కట్ట తెమ్మని చెప్పు" ఇంకో అర్ధ రూపాయికూడా ఇవ్వు" అని అరిచాడు లోపల్నించి.

"ఏందమ్మగారూ. అయ్యిగారంటున్నారు?" అయోమయంగా అడిగింది మాలచ్చి.

"బ్లేడ్లకట్ట ఒకటి తీసుకురమ్మంటున్నారు. భారత్ బ్లేడ్లు గుర్తుంటుందా?" అంది రావుమ్మ.

"అదేందో నాకు తెలవదుగాని కాగితం మీద రాసియ్యండి తెత్తాను."

ఆయన రాసిచ్చారు. ఆ కాగితం పదిలంగా పట్టుకుని బయల్దేరబోతుంటే,

"అమ్మా! అమ్మా! చామంతి పువ్వులే" అంటూ చిన్నమ్మాయి రావుమ్మగారికి జ్ఞాపకంచేసింది.

"అవును మర్చిపోయాను. ఈ రూపాయి కూడా పట్టుకెళ్లి ఓ సేరు చామంతి పువ్వులు పట్రా" అన్నారు రావుమ్మగారు రూపాయి ఇస్తూనూ.

మాలచ్చి అమ్మగారు చెప్పినవన్నీ మననం చేసుకుంటూ గేటు తలుపు తెరుస్తూంటే మేడమీదనించి పెద్దబ్బాయిగారు "ఇదుగో వచ్చేటప్పుడు ఓ హిందూ పేపరు పట్టుకురా" అన్నాడు.

మాలచ్చి ఆగిపోయి "ఏందయ్యగారూ?" అంది అర్థంకాక.

"న్యూస్ పేపరు. వార్తాపత్రిక, పేరు హిందూ. తెలిసిందా?"

"నా కెట్టా తెలుస్తద్ది అబ్బాయిగారూ కాగితంమీద రాసియ్యండి" అంది మాలచ్చి.

"ఇంకా ఇక్కడే అఘోరిస్తున్నావా. కదలవేం" అంటూ లోపల్నించి అరిచింది రావుమ్మ.

"ఇదుగో పోతుండా. అబ్బాయిగారికి ఏందో కావాలంట. పిలిస్తే ఆగాను."

"తొందరగా రా!"

"సిత్తం"

ఇదిగో ఇదీ వరస. మాలచ్చి రోడ్డువారగా ఆలోచిస్తూ నడుస్తూంది.

"అయినా తెలియక అడుగుతాను. పేపరేందో ఆయనే తెచ్చుకోలేడూ? ఏందో అందరూ పురమాయింపులే. ఒక్క మడిసిని గందా ఇన్ని సెబుతే ఏడగుర్తుండి సత్తది. అబ్బ! అమ్మగారేంది సెప్పారబ్బా? గురుతు రాదేం ఖరమ! ఈ సెడు వంకాయలు... ఇంకోటేదో కూర సెప్పారు! మిరపకాయలా? కాదు. మరి అల్లమా? కాదు. ఇంకేదో సెప్పింది. మారుకెట్టుకుపోతే అదే గాపకం వస్తాది" — అనుకున్నట్టుగానే బెండకాయలు చూడగానే అమ్మగారు చెప్పింది జ్ఞాపకం వచ్చింది మాలచ్చికి. గంటసేపు ఓపిగ్గా ఏరిగాని కూరలు పుచ్చుకోదు మాలచ్చి.

అమ్మగారి దృష్టిలో కుళ్ళినది కాని, పుచ్చినది కాని కనిపించటానికి వల్లకాదు. కూరలు పుచ్చుకోవటం అయిపోయింది. పూలకోసం మార్కెటంతా తిరిగినా దొరక లేదు. "ఏంది సెయ్యటం? పూలు కొనకండా పోతినా చిన్నమ్మ బతకనీదు. పూలకోసం పెద్ద బజారుకి పోతినా ఆలస్యం అవుద్ది. ఏ విధంగానూ తిట్లు తప్పేట్టు కానబడటంలా" — పేపరూ, బ్లేడ్లకట్టా తీసుకుని మాలచ్చి జంకుతూనే గుమ్మంలో అడుగెట్టింది. అనుకున్నంతా అయింది రాగానే ముందు మీదికి ఎగబడి సంచీ లాకుంది చిన్నమ్మ. ఆమె క్కావల్సినవి అందులో కనిపించక పోయే సరికి కళ్ళ నీళ్ళపర్యంతం అయి "చూడే అమ్మా పూలు పట్టుకు రాలేదు" అంటూ తపతపా కాళ్లు నేలకేసి కొడటం ప్రారంభించింది.

"ఏవే, పూలు తెమ్మంటినిగా మర్చి పోయావు కదూ?" అంది రావుమ్మ కొద్ది తీవ్రంగానే.

"మార్కెట్టంతా తిరిగినాను. ఎక్కడా లేవమ్మా." అంది మాలచ్చి.

"ఏడవలేక పోయావు. పెద్ద బజారుకి పోయి తీసుకురాలేక పోయినా?"

"వంటకి కూర అందటం ఆలస్యం అవుద్దని..." అర్థాంతరంగా అందుకుని "నీ మొహం లాగానే ఉందిగాని ఇప్పుడుపోయి పట్రా" అంది రావుమ్మ.

"ఏమే బ్లేడ్లు తెచ్చావా లేదా?" అంటూ

ఒక బ్యాంక్‌లో జీతాల రసీదులమీద "మీ జీతం మీ వ్యక్తిగత వ్యవహారం. దాన్ని మరెవరికీ తెలుపరాదు" అని అచ్చువేయడం ఆచారం. కొత్తగా చేరిన ఒక ఉద్యోగి అది చదువుకుని రసీదుమీద సంతకం చేస్తూ "నే నెవ్వరికీ తెలియనివ్వను. మీ కేనా, నాకు మాత్రం అవమానం కాదా?" అని సమాధానం వ్రాశాడు.

అరిచారుఅయ్యగారు. మేడమీంచి "పేపరు తెచ్చిందానివి పైకి తెచ్చి ఇవ్వాలని తెలియదుటే" అన్నాడు పెద్దబ్బాయి. ఈ కంఠాలన్నీ మాలచ్చిని తప్పుపట్టే ధోరణిలోనే ధ్వనించాయి. ఆ ధోరణి వాళ్ళు ప్రత్యేకించి ఇప్పుడు తెచ్చి పెట్టుకున్నది కాదు. మాలచ్చి విషయంలో అలా ముసుకోవటం వాళ్ళకి అలవాటయి పోయింది. వాళ్లు మాలచ్చితో కోపంవస్తే ఎలా మాట్లాడతారో ఇంచుమించుఅభిమానంగా మాట్లాడినా అల్లాగే మాట్లాడతారు. ఎక్కువ తేడా ఏమీ ఉండదు. కొడుకుని కని పురిటి స్నానం చేసివచ్చిన నాడు "ఏమే పాడుముండా కొడుకుని కనికూచున్నావు." అంది రావుమ్మ చిరునవ్వుతోనే. కోపంవచ్చి "నీపిండాకుడు! నీకుబద్ధకం బలిసి పోయిందిలే" అన్న సందర్భాలూ ఎక్కువగానే ఉన్నాయి. అప్పుడు నవ్వుతూ అన్నమాటకి ఇప్పుడు కోపంగా అన్న మాటకీ తేడా అప్పుడు నవ్వుతూ తిడుతే ఇప్పుడుకోపంగా తిట్టటం అంతే!

మాలచ్చి బ్లేడ్లకట్టఅయ్యగారికిచ్చి పేపరు పెద్దబ్బాయిగారికిచ్చి అమ్మగారి ముందువచ్చి నిలబడింది. "ఏమేపూలు పట్టుకురమన్నానా? ఇంకా ఇక్కడే నిలబడి పోయావు?" అంది రావుమ్మ.

మళ్ళీ బయలుదేరింది మాలచ్చి. "తొందరగా రా! అక్కడే కూరుకుపోక" అని హెచ్చరించింది రావుమ్మ.

* * *

మాలచ్చి పూలు తీసుకుని గుమ్మంలో అడుగుపెట్టగానే అమ్మగారు వేసిన మొం

పళ్ళ "ఏమే ఆకూరలు ఎంతకు తెచ్చావో చెప్పలేదేం?" అని.

"మరిచిపోయాను. ఇంతలో మీరు మళ్ళీ పంపిస్తిరాయె" అంటూ మా లచ్చి వాటి వాటి ధరలు చెప్పుకొచ్చింది.

"ఒంకాయలు అర్ధరూపాయా? అవ్వ!! నిన్నకదుటే అబ్బాయి ఆ రణాలకి పట్టుకొచ్చాడు" అంది రావుమ్మ ఆశ్చర్యంగా, అనుమానంగా.

"మార్కెట్టు అంతా తిరిగినాను. ఒకటే ధర" అంది మా లచ్చి.

"ఒక్క రోజులో రెండణాలు పెరిగిపోతాయా. ఎక్కడ విచిత్రమే! అయినా నిన్నవాళ్ళిం దేముందిలే. ఇంటికయినవాళ్లు చూసుకోక పరాయివాళ్ళమీద ఆధారపడితే ఇలాగే ఉంటాయి. ఇక ఈ కొంప భాగు పట్టంకల్ల. మొగపిల్ల లున్నారన్న మాటే గాని అంతా లార్డులు. అంతా జమీందారీ దర్జాలు. వేళకి కంచం దగ్గరకి చేరటం తప్పించి బాధ్యతలంటూ ఏడుస్తున్నాయా? ప్రతి చిన్నపనికీ, పెద్ద పనికీ పరాపేక్షే. ఇక ఈ సంసారం ఇంతేలే"—అంటూ అమ్మగారు ఈ వాసని మాట్లాడుతుంటే మా లచ్చికి ఒళ్లంతా చచ్చిపోయినట్టనిపించింది. అభిమాన స్వరంతో "నేనేమీ దిమ్మిడీ పరాయివారి సొమ్ము తొకను. అట్టాటి పాడుబుద్ది నాకాడలేదు. కావలస్తే మీ అబ్బాయిగార్ని పంపించి ధరలు విచారణ సేయించుకోండి" అంది.

అమ్మగారు అగ్గైపోయారు. పనిమనిషి ఎదురు జవాబు చెబితే సహించటం ఆమె స్వభావానికే వ్యతిరేకం. "నోరుముయ్యి. మహా పౌరుషపు మాటలు మాస్తున్నావు" అంది కళ్లు ఎర్రచేసి.

మా లచ్చి నోరుమూసుకుని బావి దగ్గరికి వెళ్ళిపోయింది. "అబ్బ! ఇంకా సచ్చేచాకిరీ ఉండాది. రెండు గోలాల నిండా నీళ్లు తోడాలి. రెండు గంగాళాల నిండా తోడాలి, అరుబిందెలూ నింపాలి. ఈయాల అంట్లుతో మేతిలికే పచ్చిపుండయిపోనాది" అనుకుంది మా లచ్చి నీళ్ళుతోడుతూను.

బిందెనిండా నీళ్లు తోడేసరికి చిన్నబ్బాయి వచ్చి తోడిసిన నీళ్ళన్నీ పారబొయ్యటం మొదలెట్టాడు. అది వాడికి ఆట, తినేమన్నా అంటే ఏడుస్తాడు. ఏడుస్తే తనేదో చేసిందని అమ్మగారు ఇరుచుక పడతారు.

మా లచ్చి నీళ్ళు తోడుతూనే వుంది. వాడు పారబోస్తూనే ఉన్నాడు. ఎవరు మటుకు వారు వాడలా పారబొయ్యటం చూస్తూనే ఉన్నారు. చూస్తూనే తమకేమీ పట్టనట్టుగా 'పోతున్నారు. "అమ్మగారు అబ్బాయిగారు నూడండి" అంటూ ఫిర్యాదు చేసింది మా లచ్చి నవ్వుతూనే. కాని రావుమ్మగారు ఇంకేదో ధ్యాసలోవుండి వినిపించుకోలా.

మా లచ్చి నవ్వుతూనే "బాబుగారండీ! తప్పు! తప్పు!" అంది ముక్కుమీద వేలు వేసుకుని చిన్నబ్బాయిని ఉద్దేశించి.

మా లచ్చి నల్లటివిగ్రహం, తెల్లటి పలువరస బైపపెట్టి నవ్వేసరికి చిన్నబ్బాయికి భయమేసింది కాబోలు. అంతమాత్రానికే వాడు 'కార్'మంటూ ఏడుపు లంకించుకున్నాడు. మా లచ్చి ఎవరేమంటారో అని హడలిపోయింది. కుర్రాడి గొంతువినగానే వంట గదిలోంచి రావుమ్మగారు, వీధి గదిలోంచి పెద్దయ్యగారూ ఒక్కసారే పెరట్లోకి వచ్చేశారు ఆదుర్దాగా.

"ఎందుకేడుస్తాడు?" అంది రావుమ్మగారు ఏదో అరా తీస్తున్నట్టుగా.

"నీళ్ళు పారబోస్తూంటే నవ్వుతూనే తప్పు అబ్బాయిగారూ అన్నానంతే! ఏడుస్తుండాడు" అంది మా లచ్చి.

"నీ మొహం! కసుఋకుని వుంటావు" అంటూ రావుమ్మ కొడుకుని ఎత్తుకొని లోపలికి వెళ్ళిపోయింది.

మా లచ్చి మనసు కుదుటపడింది. ఇదేం చిలికి చిలికి గాలివాన అవుతుందోనని భయపడ్డది ముందు. మా లచ్చి నీళ్ళుతోట్టం అవగానే "అన్నట్టు మరిచానేవ్. ఓ సన్‌లైటు సబ్బు, ఓ హమామ్ సబ్బు పట్టుకురా. యిందాక చెప్పటం మరిచిపోయాను" అంటూ పురమాయించింది రావుమ్మగారు.

"ఇలు తుడిచిపోతాను" అంది మాలచ్చి.

"మళ్ళీ మర్చిపోతావు. పోయిరా. వచ్చి తుడుద్దువు గాని"—అంది రావుమ్మ.

మాలచ్చి వెళ్లి సబ్బులు పట్టుకువచ్చింది. చీపురు పుచ్చుకుని ముందువసారాలోకి నడిచింది. అక్కడ కూచుని అయ్యగారు ఎవరితోనో మాటాడుకున్నారు. మధ్యగదిలోకొస్తే రెండో అబ్బాయిగారు ఏదో చదువుకుంటున్నారు గదిమధ్యన పుస్తకాలుపరుచుకుని. మిగతా గదులన్నీ ఊడ్చి మధ్య గదిలోకొచ్చి "లెగండి అబ్బాయిగారూ" అంది.

"సరిగ్గా నే చదువుకునేటప్పుడే నువ్వు చీపురుచ్చుకుని తయారవుతావు. ముందుగా రాకూడదూ! కాసేపుండి ఊడు. ఇప్పుడు నన్ను డిస్టర్బ్ చెయ్యకు అన్నాడతడు.

కాదు బాబూ. నాను మల్లీ భోజెడంత చాకిరీ చేసుకోవాల. మేడమీద ఊడవాల. అమ్మాయిగోర్కి నీళ్లు పొయ్యాల, జడెయ్యాల, అమ్మాయిగార్ని బడికి తీసుకుపోవాల. ఎన్ని పనులున్నయో సూడండి. కాస్త లెగండి. తుడిసేసి పోతాను. పన్లో పని అయిపోతాది" అంటూ బ్రతిమిలాడింది మా లచ్చి.

"బ్రహ్మచారులకంటే వివాహితులే దీర్ఘకాలం బతుకుతారట, నిజమేనా?" అని ఒక బ్రహ్మచారి ప్రశ్నించాడు.

"అబ్బే, అలా అనిపిస్తుంది అంతే" అని వివాహితుని జవాబు.

"అబ్బ! నువ్విక్కడ్నించి పోముందు. నన్ను చదువుకోనీ" అన్నాడతడు విసుగ్గా.

"తుడవకుండా పోతే అమ్మగారు కోప్పడతారు. నాకేం మీమీన సెబుతాను" అంటూ బెదిరించింది మాలచ్చి.

"చెబితే చెప్పుకో. నాకేం భయంలేదు. నన్ను అనవసరంగా డిస్టర్బ్ చెయ్యకు. ముందు పోతావా పోవా"

మాలచ్చి గత్యంతరం లేక ఇవతలికి వచ్చేసి అమ్మగారితో ఫిర్యాదు చేసింది. "అవునే. సరిగ్గా వాళ్లు చదువుకునేప్పుడే వెళ్ళకపోతే ముందే తుడిచెయ్య కూడదూ" అంది రావుమ్మ.

మాలచ్చికి ఏం మాట్లాటానికీ తోచలేదు. ఉదయం నుంచీ తను ఊరికే కూచున్నట్టూ, కేవలం పని ఎగ్గొట్టటం కోసమే ఇటువంటి ఎత్తులు వేస్తున్నట్టూ అమ్మగారు మాట్లాడుతుంటే మాలచ్చికి ఏదో విరక్తి కలిగినట్టుగా అనిపించింది. "ఎంత సేసినా మెప్పుదల లేదు. ఏదో కచ్చకట్టినట్టుగా మాట్లాడుతారేం" అనుకుంది మాలచ్చి వెగటుగా.

"ముందు అమ్మాయికి నీళ్లుపోసి జడెయ్యి" అన్నారు రావుమ్మగారు.

మాలచ్చి చిన్నమ్మాయికి నీళ్లుపోసి జడవేస్తూ కూచుంది. మేడమీంచి పెద్దబ్బాయి "మాలచ్చీ ఎదురింటి వాళ్లనడిగి టైము ఎంతయిందో కనుక్కురా?" అంటూ పురమాయించాడు.

"అదేం? నీ గడియారం ఆగిపోయిందా?" అంది రావుమ్మ కించపరిచే.



నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది. మేహము ఎక్షాత, నిస్సత్తువ మొదలగువాటిని హరించి బలమునురక్తవృద్ధినికలిగించును. 20తు. డబ్బీ రు3-4. పోస్టేజి అ15. పి.సి.ఏ.అండ్‌కో,"ఆయుర్వేదసమాజం"
పెరిదేపి, నెల్లూరుజిల్లా.

# ★ పనిమనిషి ★

"నిన్న 'కీ' ఇవ్వటం మర్చిపోయాను. ఆగిపోయింది" అని సమాధానం చెప్పాడు పెద్దబ్బాయి.

రావుమ్మగారు నిట్టూర్చి "గడియారానికి 'కీ' ఇవ్వటానిక్కూడా తీరికలేనంత రాచ కార్యాలేమున్నాయంట" అంది.

"ఇంకా కదలవేం చెబుతూంటే?" అంటూ అరిచాడు మేడమీంచి పెద్దబ్బాయి.

మాలచ్చి గమ్మున చేతిలో జడ వదిలేసి లేవబోయింది. "అమ్మా! చూడవే జడ సగం వేసి పోతూంది" అంటూ ఏడుపు ముఖం పెట్టింది చిన్నమ్మాయి.

"మాలచ్చీ! ఈ కాగితాలు అవతల వీధిలో సుందరయ్యగారికిచ్చిరా." అంటూ పురమాయించారు పెద్దయ్యగారు గదిలోంచి ఇవతలికి వస్తూను.

"ఆ జడవేసి పోరాదుటే" అన్నారు రావుమ్మగారు గదిలోంచి.

మాలచ్చి రెండుకాళ్లూ క్షణం ఎటూ కదలకుండా నిలబడి పోయాయి. చప్పున వెళ్ళి ఎదురింటి వాళ్ళ నడిగి టైము తెలుసుకుని వచ్చి పెద్దబ్బాయి గారితో చెప్పి అయ్యగారి చేత తిట్లు తిని కాగితాలు తీసుకుని అవతల వీధిలో ఉన్న సుందరయ్యగారికిచ్చి వచ్చేసరికి చిన్నమ్మ కోపంతో జుట్టంతా రేపుకుని బుంగమూతి పెట్టుకుని రాగాలు తీస్తూంది.

"దానికి సగం సగం జడ వేశావుట. కోపం వచ్చి అంతా రేపుకుంది." అన్నారు రావుమ్మగారు అదేదో మహా ఘన కార్యం చేసినట్టుగా నవ్వుతూను.

మళ్ళీ జెడ పూర్తిగావేసి పూలు పెట్టి బట్టలు తొడిగి సిద్ధం చేసేసరికి "ఇంకా దాన్ని స్కూలికి తీసుకుపోలా?" అంటూ అరిచారు పెద్దయ్యగారు.

మాలచ్చి చిన్నమ్మాయిని తీసుకుని స్కూలుకి బయలు దేరింది. అమ్మాయిని స్కూల్లో వదిలేసి ఇంటికి వచ్చేసరికి పెద్దయ్యగారు "ఒసేవ్ ఇలారా! దొడ్డంతా నానా చండాలంగానూ ఉంది. బాగు చేద్దువుగాని" అన్నారు. పెద్దయ్యగారు స్వయంగా దగ్గర ఉండి అరిటి చెట్లన్నీ నరికించారు, అన్నం దగ్గర వేసుకోవటానికని పనికివచ్చే చిన్న చిన్న ఆకులు విడిగా కోయించారు. గోడ మూలనున్న మట్టిదిబ్బ తవ్వించి ఆ మట్టి దొడ్డంతా పరిపించారు.

మాలచ్చి ఒళ్లంతా పచ్చి పుండయి పోయింది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. చేతులు మంటలు పుడుతున్నాయి.

వంటగదిలోంచి రావుమ్మగారు "ఇక భోజనానికి లేవండి" అంటూ పిలిచారు. రావుమ్మగారికి వెయ్యిదండాలు పెట్టింది మాలచ్చి పెద్దయ్యగారు భోజనానికి వెళ్ళగానే.

"అమ్మగోరూ, ఇంటికిపోతుండాను" అని చెప్పి మాలచ్చి పరుగు నడకలతో బయలు దేరింది. తనుపోయి వంట చేసుకోవాలి. ఇవాళ అమ్మగారు చద్దివన్నం కూడా పెట్ట లేదు. అబ్బాయికి నీళ్లుపోసుకోవాలి. ఆదరా బాదరాగా భోజనం చేసుకుని మళ్ళీ పనిలోకి పోవాలి. అమ్మగారిచ్చిన కారీయ పట్టుకుని స్కూలుకి పోవాల. ఏమాత్రం ఆలస్యం అయినా అబ్బాయిగారు ఊరుకోరు—మాలచ్చి త్వర త్వరగా నడక సాగించింది. అడుగులు అనుకున్నంత చురుగ్గా పట్టం లేదు. "అయ్యగారు దొడ్డి పనిచేయించకపోతే ఇంత ఆలస్యం అయేది కాదు. ఏందో ఆయన చెయ్యమంటే తనేం అనగల్దు? పెద్దోరు! తప్పకాదూ?"—మాలచ్చి ఒగర్చుకుంటూ ఇంటికి చేరుకుంది. దూరంనించే పసివాడి ఏడుపు వినిపించి మరింత త్వరగా పరుగులుతీసి చేరుకుంది.

"ఏందమ్మా! ఇంతసేపా పసికూనను ఒగ్గేసి? ఏడిసి ఏడిసి గొంతార్చుకుపోతుంటే సూడు ఎలా కక్కు తిర్లిపోనాడో" అంటూ సరమ్మ మందలించింది పిల్లాడ్ని అప్పచెబుతూను.

రెండు చేతుల్తోనూ అబ్బాయిని గట్టిగా హృదయానికి హత్తుకుంది మాలచ్చి. తనివి తీరా ముద్దులు పెట్టుకుంది. నీళ్లు పోసావని సరమ్మ చెబితే కడుపునిండా పాలిచ్చి మంచం మీద పడుకో బెట్టింది. పొయ్యిలో నిప్పు చేసింది.

మాలచ్చి వంటచేసుకుని తిని అబ్బాయిని సరమ్మకి అప్ప చెప్పి వెళ్ళబోతుంటే అవునుగాని మాలచ్చీ ఓ మాటడుగుతాను. సెబుతావూ?" అంది సరమ్మ.

"ఏం దది?"

"సెబుతానంటే అడుగుతా"

"సెబుతాలే, అడుగు"

"అబ్బిగాడు నీ బిడ్డడా? నాబిడ్డడా? ఎవరు సాకితే ఆరి బిడ్డడు. అంతేనా?" అంది సరమ్మ పుత్రాడ్ని ముద్దుపెట్టుకుంటూను.

అప్రయత్నంగా మాలచ్చి రెండు కళ్ళూ చెమర్చాయి. "అవునే నువ్వన్నదే నిజం, అబ్బిగాడు నీవాడే నే అవునుగాని నాను లేనప్పుడు అబ్బిగాడు ఏం చేత్తాంటాడే? సక్కంగా, సిత్రంగా ఆడుతూంటాడు కదటే?" అంది మాలచ్చి ఏదోలోకం లోంచి మాట్లాడుతున్నట్టుగా.

"అవునే అబ్బిగాడు మహా సురుకైన నాడు. ఎంత సిత్రంగా ఆడతాడనుకున్నావ్! మహాసిత్రంగా నవ్వుతాడు" సెబితే కాదు. సూడాల్సిందే ఆ సోయగం" అంది సరమ్మ.

మాలచ్చి దిగులుగా నిట్టూర్చింది "ఓరోజు అమ్మగార్నడిగి సెలవు తీసుకుంటా. ఆ రోజల్లా బాబిగాడితోనే ఆడుకుంటా. ఎన్నాళ్ళయిందో అబ్బిగాడితో ఆడుకుని" పొద్దున్న అనగా పోతే మద్దినో గంట యవది. మళ్ళీ రాతిరివరకూ తిరిగిరాటం పట్టంలేదు. పనిలో కూరుకుపోతే అంతే! ఇక తేలటం అంటూ ఏదుస్తేనా?" అంది.

"నీకు వేళకాలా, నాతో ఊసులాడుతూ కూకుండావ్? అని జ్ఞాపకం చేసింది సరమ్మ.

"అవునేవ్, మరిసిపోనాను. అబ్బిగాడి గురించి సెబుతూంటే మరిశాను" అంటూ మాలచ్చి ఉరుకులూ పరుగులూ తీస్తూ అయ్యగారి గుమ్మం తొక్కింది.

"ఇంత సేపుటే ఆలస్యం. నిన్ను తాట ఒలిచినా పాపం లేదు. ఇంకా చూస్తావేం కారీయ సిద్ధం చేశాను. తీసుకుపో. మళ్ళీ త్వరగా రా! అంటకంచాలు దబ్బునతో మాలి ఎండిపోతున్నాయి" అంటూ ఎగిరి పడింది రావుమ్మ.

కారీయ తీసుకుని బయలుదేరింది మాలచ్చి కాళ్లు తీపులు పెడుతున్నాయి. శీతాకాలపు ఎండ మహాతీక్ష్ణంగా దుర్భరంగా కాస్తూంది. రోడ్డువార చెట్లనీడల్లో పరుగునడకలు తీస్తూంది మాలచ్చి. అబ్బాయిగారికి ముక్కుమీదుంటది కోపం. ఆలస్యం అయిందా సీవాట్లు తప్పవు" అనుకుంటూ నడకకి మరింత వేగం హెచ్చించింది మాలచ్చి.

"అయ్యా! టైము ఎంతవుద్ది?" అని దారిలో ఒకర్ని అడిగింది. రెండయిందని తెల్సుకుని 'అయ్యబాబో' అనుకుంది మాలచ్చి. "రెండున్నరకే బడి తెరుత్తారు. ఇక అర గంటకంటె యవదానం లేదు"—మాలచ్చి

(60-వ పేజీ చూడండి)

## 'ఆయన మొహం'

"ఏమిటోయ్ ఆ బొమ్మ. నా మొహంలా ఉంది. అదేనా న్రియలిస్టుకళ అంటూ చెప్పుకుంటారు? దారుణం"

"మన్నించాలి. అది నేను వేసిన బొమ్మ కాదండి. తమరు అద్దంలో చూస్తున్నారు" అన్నాడు చిత్రకారుడు.

# గుర్రం తోక

ఏనుగుని పడిపించిన జోరీగ కథ తెలుసా? ముప్పు తిప్పలూ పెట్టేసింది ఒక సారి. 'నా ముందు నువ్వెంత' అంది ఏనుగ మొదట. జోరీగకి కోపంవచ్చి, 'నీపని పడతానుండు' అని, ఏనుగ చెవిదగ్గర చేరి మోత మొదలుపెట్టింది. చాటంత చెవిని ఏనుగ ఒక విసురున ఆడించింది. జోరీగ ఎగిరి అవతల చెవి దగ్గర కెళ్లింది. అక్కణ్ణించి, ఏనుగ నెత్తిన ఎక్కింది. కళ్ల చుట్టూ నాట్యం ఆడిపోయింది. మళ్లా చెవిలో హోరెత్తించింది. ఒకసారి ఆ జోరీగ, తన కుంభ స్థలంమీద ఉండగా ఏనుగ పరుగెత్తికెళ్లి ఒక చెట్టుకు తల కొట్టుకుంది జోరీగ చితికిపోతుంది కదా అని. కాని, జోరీగ క్షణంలో ఎగిరి చెవిలో చేరింది, ఏనుగ కుంభ స్థలం దెబ్బ తింది. ఆ ఏనుకి రాను రాను మతి పోయింది దీన్ని వదలించుకోవడం ఎలాగా భగవంతుడా అని. తాండవం ఆడిపోయింది. చివరికి, ఆ బెడద ఎలా తప్పిందో తెలుసా? హుషారులోఉన్న జోరీగ, ఏనుగ చెవిమీద ఉండగా, హఠాత్తుగా ఏనుగ చెవి నింకోసారి విసిరి ఒంటికి కొట్టుకుంది. ఆ దెబ్బకి జోరీగ చితికి పోయింది.

ఇంత చిన్న జోరీగ అంత పెద్ద ఏనుగని ముప్పు తిప్పలు పెట్టేసినట్టే గుర్రానికి గోమార్లు పిచ్చెత్తిం చెయ్యగలవు. ఇలాటి "పీడ విరగడవడానికి" ఏనుగకి చెవి, ఎంత ఉపయోగపడిందో, గుర్రానికి తోక అంత ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా గుర్రం పరుగెత్తి అలసిపోయినపుడు ఒళ్లంతా చెమటపట్టి చిర చిర లాడుతుంది. ఆ బాధకి గోమార్లపీడ తోడైతే పట్ట పగ్గాలుండవు. అప్పుడు ముందువేపు అందినంత వరకూ ముట్టెతోనూ, ఆపైన తోకతోనూ గుర్రం వాటిని తోలుకుంటుంది. ఒళ్లంతా చిర చిర లాడుతున్నప్పుడు గనక, ఆ తోక అందుబాటులో లేకపోతే, గుర్రం గింజుకుంటుంది. గంతులేస్తుంది. సకిలిస్తుంది. అటువంటి సమయంలో బండికిగాని కట్టివుంటే, వెనక కాళ్లతో ఆ బండిని ఫేడీ ఫెడీమని తంతుంది. ఆ ఊపుకి ఒక్కొక్కసారి బండి బోల్తా కొట్టేస్తుంది. బండిలో ఉన్నవాళ్లు మాత్రం పొగరుమోతు గుర్రం అని తిట్టుకుంటారు కాని, దాని బాధ గ్రహించరు.

గుర్రాల్ని బండికి కట్టడానికి సవారీకి వాడదలుచుకున్నపుడు దాన్ని శుభ్రంగా ఉంచాలి. గోమార్లని దరి చేరనివ్వకూడదు. కొందరు ఈ శుభ్రత పేరుచెప్పి అందంగా ఉంటుంద, గుర్రం తోకని కురచగా కత్తిరించివేస్తారు. ఏపుగా పొడుగ్గా ఉండే తోకను కత్తిరించడం గుర్రానికి ఎంతో బాధాకరం. పైగా, తోక పొట్టిది అయిపోతే, దాని ఒంటిని పట్టే గోమార్లను తోలుకోడానికి వీలుండదు. అంటే, గుర్రం తోకని, అందంకోసం కత్తిరించడం హింస అన్నమాట.

## సమస్యలతో రణం

దానికి ఎంత స్పీడు ఉంటే అంత స్పీడునా పరిగెత్తిం చేస్తాడు.

ఆలాగే అపర్బ్రహ్మం గుజ్జం పరబ్రహ్మం చేతికి చిక్కగానే దాన్ని దౌడు తీయిస్తాడు.

అంటే ఏం జరుగుతుంది? మామూలు గుజ్జప్పందెం జరుగుతుంది.

ఎవడిదగ్గిరున్న గుజ్జం ముందు పరిగెడుతుందో వాడే గెలిచినట్టు.

ఎలాగో మీకు తెలుసుగా! అది మళ్లీ మీకొక సమస్యకాదుగా!

★

## పనిమనిషి

(22- వ పేజి తరువాయి)

ఎంత వేగంగా నడిచినా తనకంటె యీ చెట్లూ, ఇళ్ళూ, వాకిళ్ళూ వేగంగా ముందుకు కదిలి స్కూలుకి తన్ని దూరంచేస్తున్నాయా అనిపిస్తోంది. నడవవల్సిన దూరం నడిచిన దూరానికి రెండు రెట్లు వుంది.

మాలచ్చి నుదురు చెమటలు కక్కుతోంది. ఒక చేతిలో కారీరు. ఒక చేతిలో విస్తరాకు. "ఎడిన్నా దింపి నుదురు తుడుసుకుంటే ఆలస్యం అవుద్ది" అనుకుంది మాలచ్చి. ఎదురెండకి కళ్ళు మంటలు ప్రారంభించాయి.

దూరంగా బడిపిల్లలు గెంతుతూ అరుస్తూ కనిపించారు. మాలచ్చిముఖం దాగరంలయింది. ఇంకా స్కూలు తెరవనేదు"— అనుకుంటూ పరుగులు తియ్యసాగింది మాలచ్చి.

కాని... కాని... "అకేంది పిల్లలు లోనకి నగెత్తుతుండారే. వేళ అయిపోనాదా? చిన్నబాబుగారు ఈ పూట పస్తే? అయ్యబాబోయ్!!!"

గబగబా పరుగులు తీసింది మాలచ్చి.

బడి గంటలు టంగు టంగుమని వినిపించాయి.

మరింత వేగంగా పరుగెత్తింది మాలచ్చి కాని అప్పటికే గేటు తలుపులు మూసేశారు. గుండెలు దడదడా కొట్టుకుంటుంటే, ఊపిరందక ఉక్కిరిబిక్కిరౌతూ వెర్రిగా దర్వాన్ ముఖంలోకి చూస్తూ నిలబడిపోయింది పనిమనిషి మాలచ్చి.

★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.